ఇక నార్సింగి వంతు..!

- బల్దియాల్లో కొనసాగుతున్న అవిశ్వాసాల పర్వం
- తాజాగా మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం
- మద్దతుగా కలెక్టర్‌కు లేఖ ఇచ్చిన 12 మంది కౌన్సిలర్లు


అవిశ్వాస లేఖను అందించిన కౌన్సిలర్లతో కాంగ్రెస్ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీల్లో అవిశ్వాసాల పరంపర నార్సింగిని తాకింది. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌ను ఇప్పటికే పదవి నుంచి తొలగించడం, అలాగే మణికొండలో అవిశ్వాసం వీగిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అదే దారిలో నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ డి.రేఖాయాదగిరితో పాటు వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్‌ను కూడా పదవి నుంచి తప్పించేందుకు కౌన్సిలర్లు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇందుకోసం కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో 12 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన అవిశ్వాస లేఖను గురువారం కలెక్టర్‌కు అందించారు. దాంతో పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత అవిశ్వాస తీర్మానానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసే అవకాశం ఉండనున్నది. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి కొన్ని రోజులుగా అవిశ్వాసానికి అవసరమైన కౌన్సిలర్ల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నించి సఫలం అయ్యారు. ఇప్పటివరకు బీఆర్ఎస్ కోటాలో ఉన్న మున్సిపాలిటీ త్వరలోనే కాంగ్రెస్ వశమయ్యే అవకాశం కనిపిస్తోంది.

అనూహ్యంగా పెరిగిన మద్దతు..

నార్సింగి మున్సిపాలిటీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తరఫున 3వ వార్డు విజయ్‌బాబు (కోకాపేట), 4వ వార్డు దుర్గేశ్ యాదవ్ (కోకాపేట), 9వ వార్డు లక్ష్మీప్రవళిక కిరణ్ (నార్సింగి), 10వ వార్డు నాగపూర్ణశ్రీనివాస్ (మంచిరేవుల), 12వ వార్డు జి.అమరేందర్‌రెడ్డి (ఖానాపూర్), 15వ వార్డు పద్మవీరారెడ్డి (మంచిరేవుల), 17వ వార్డు కె.ఉషారాణి (నార్సింగి), 18వ వార్డు నరేశ్(మంచిరేవుల) మొత్తం 8 మంది గెలుపొందారు. వారిలో 15వ వార్డు కౌన్సిలర్ పద్మవీరారెడ్డి బీజేపీలోకి, 17వ వార్డు కౌన్సిలర్ ఉషారాణి బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. దాంతో కాంగ్రెస్‌లో ఆరుగురు మాత్రమే మిగిలారు. గతంలో కాంగ్రెస్ తరఫున గెలిచి పార్టీలు మారిన ఇద్దరు అవిశ్వాసానికి మద్దతు ఇవ్వడంతో మళ్లీ వారి బలం 8 మందికి పెరిగింది. వారితో పాటు బీఆర్ఎస్ తరఫున గెలిచిన 5వ వార్డు కౌన్సిలర్ జి.శివారెడ్డి (కోకాపేట), 8వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన పత్తి ప్రవీణ్‌కుమార్(నార్సింగి), బీఆర్ఎస్‌కు చెందిన 11వ వార్డు కౌన్సిలర్ గోపాల సునీతాగణేశ్(గండిపేట), బీజేపీ తరఫున గెలిచిన 14వ వార్డు కౌన్సిలర్ ఆర్. ఆదిత్యరెడ్డి అవిశ్వాసానికి మద్దతు ఇస్తూ సంతకాలు చేశారు. దాంతో కాంగ్రెస్‌లో ఉన్న ఆరుగురికి మరో ఆరుగురు జత కావడంతో అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్ల బలం 12కు చేరింది.

అప్పట్లో అలా..

నార్సింగి మున్సిపాలిటీలో మొత్తం 18 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో అప్పటి అధికార బీఆర్ఎస్ తరఫున ఏడుగురు మాత్రమే గెలుపొందారు. 1వ వార్డు (వట్టినాగులపల్లి) నుంచి గెలుపొందిన స్వతంత్ర కౌన్సిలర్ బి.యాదమ్మ మద్దతు ఇవ్వడం, 14వ వార్డు (కోకాపేట) బీజేపీ కౌన్సిలర్ ఆర్. ఆదిత్యరెడ్డి గైర్హాజరు కావడం, ఎక్స్ అఫిషియో ఓటర్లుగా స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్, ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి ఓట్లతో మున్సిపాలిటీని చేజిక్కించుకున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రావడం, మెజార్టీ కౌన్సిలర్లు ప్రస్తుత చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అసమ్మతిగా ఉండడంతో వారి బలం అనూహ్యంగా 12కు పెరిగి అవిశ్వాసానికి దారి తీసింది.

మంచిరేవులకు చైర్‌పర్సన్ పదవి..?

నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పదవి ఎస్సీ జనరల్‌కు రిజర్వు ఉంది. అప్పట్లో ఖానాపూర్ నుంచి చైర్మన్ రేసులో ఉన్న ఆర్. నర్సింహ ఓటమి చెందడంతో గాలిదొడ్డి నుంచి గెలుపొందిన డి. రేఖాయాదగిరికి అనూహ్యంగా పదవి వరించింది. ప్రస్తుతం కాంగ్రెస్‌కు చెందిన 10వ వార్డు(మంచిరేవుల)కు చెందిన నాగపూర్ణ శ్రీనివాస్‌ను చైర్‌పర్సన్ చేయాలని మెజార్టీ కౌన్సిలర్లు నిర్ణయించినట్టు సమాచారం. వైస్ చైర్మన్‌గా ప్రస్తుత మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, 3వ వార్డు కౌన్సిలర్ (కోకాపేట) విజయ్‌బాబును ఎన్నుకోనున్నట్లు సమాచారం.

రేపు సాయిసంస్థాన్ వార్షికోత్సవం

మణికొండ: నార్సింగి సాయి సంస్థాన్ ఆలయం 17వ వార్షికోత్సవాన్ని ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కె.వినోద్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 నుంచి సాయంత్రం వరకు అభిషేకం, అర్చన, హారతి, పల్లకీ సేవలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున అన్న ప్రసాదం పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు.

నేటి నుంచి సీబీఐటీలో 'హ్యాకథాన్'

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో ఈ నెల 26 నుంచి 27 వరకు జాతీయ స్థాయి హ్యాకథాన్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మైక్రోసాఫ్ట్, బైట్ ఎక్సెల్ సహకారంతో 24 గంటల పాటు జరుగనున్నట్లు పేర్కొన్నారు. వాస్తవ ప్రపంచ సమస్యలు పరిష్కరించడంలో విద్యార్థులు పోటీ పడతారని, ఇందులో ప్రతిభ చూపిన వారికి మొదటి బహుమతిగా రూ. 1.50లక్షలు, రెండో బహుమతిగా రూ. 75 వేలు, మూడో బహుమతిగా రూ. 50 వేలు అందిచనున్నట్లు తెలిపారు. శుక్రవారం ప్రారంభోత్సవ వేడుకకు మైక్రోసాఫ్ట్ ప్రిన్సిపాల్ ప్రొడక్ట్ మేనేజర్ మణిదీప్, బైట్ ఎక్సెల్ సహ వ్యవస్థాపకుడు శ్రీచరణ్ హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నామినేషన్‌కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


మణికొండ నుంచి తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

మణికొండ: చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా గడ్డం రంజిత్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. జితేందర్, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

నియామకం


ప్రశాంత్ నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు ఆధ్వర్యంలో ఆ డివిజన్ బీజేపీ గిరిజన మోర్చా అధ్యక్షుడిగా బుద్వేల్‌కు చెందిన ప్రశాంత్ నాయక్‌ను శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్ నాయక్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించిన సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాజేంద్రనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బండారి బాలకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు మూల శ్రీనివాస్ గౌడ్, హరికిషన్, సురేందర్, గుంటి రాజ్ కుమార్, క్రాంతి కుమార్, రాకేశ్ గౌడ్, రాఘవేంద్రచారి, యాదయ్య, గోపాల్, పవన్, సందీప్, హర్షిత్ రెడ్డి పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో కాంగ్రెస్ రోడ్ షో

పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఆర్డీఓ కార్యాలయం నుంచి హైదర్‌గూడ చౌరస్తా వరకు కాంగ్రెస్ పార్టీ గురువారం నిర్వహించిన రోడ్ షో విజయవంతమైంది. రాజేంద్రనగర్, గండిపేట్, శంషాబాద్ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సిక్కు సోదరులు సీఎం రేవంత్ రెడ్డికి తలపాగా చుట్టగా ఆయన అలాగే రోడ్ షోలో పాల్గొన్నారు. రోడ్లకిరువైపులా ప్రజలు సీఎంకు స్వాగతం పలికారు.

ఉత్సాహంలో నాయకులు..

రోడ్ షో విజయవంతం కావడంతో పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

స్పృహ తప్పిన వ్యక్తి ఆసుపత్రికి తరలింపు..

సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగ సమయంలో ఓ వ్యక్తి స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు అంబులెన్స్, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వేదికపై నుంచి గమనించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంబులెన్స్‌కు దారి ఇవ్వాలని సూచించడంతో పోలీసులు స్థానికుల సహాయంతో ఆ వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించిన అనంతరం ఇంటికి పంపించారు.


సిక్కు సోదరులు అందించిన తలపాగా ధరించి ప్రసంగిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి


స్పృహ తప్పిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న నాయకులు

ఆస్తిపన్ను మదింపు అక్రమాలపై విచారణ జరపాలి



జెడ్సీ స్నేహకు వినతిపత్రం అందజేస్తున్న నాయకుడు శోభన్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఆస్తి పన్ను మదింపు వ్యవహారంలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌కు సీపీఐ (ఎం) నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. సీపీఐఎం శేరిలింగంపల్లి జోన్ కార్యదర్శి సి.శోభన్, మెంబర్ కృష్ణలు డైమండ్ హిల్స్‌లోని వాణిజ్య సంస్థలు ఆస్తి పన్ను మదింపులో అనేక అక్రమాలు జరిగాయన్నారు. సర్కిల్ పరిధిలోని అనేక వాణిజ్య సంస్థలకు చెందినవి ఇదే కోవలోకి వస్తాయని, వాటిపై విచారణ జరిపితే కోట్లాది రూపాయల ఆదాయం జీహెచ్‌ఎంసీకి వస్తుందని వివరించారు. విచారణతోపాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అధ్వానంగా బల్దియా వార్డు కార్యాలయం

గోల్కొండ: గోల్కొండలోని బల్దియా వార్డు కార్యాలయం నిర్వహణ అధ్వానంగా తయారైంది. వివిధ పనుల కోసం వచ్చే వారు కార్యాలయ భవనాన్ని చూసి ఇదేమి నిర్వహణరా బాబు అంటున్నారు. కుతుబ్‌షాహీ రాజుల లాంటి భవనంలో కొనసాగుతున్న ఈ కార్యాలయ భవనానికి తూతూ మంత్రంగా మరమ్మత్తులు చేస్తున్నారే తప్ప కొత్త భవన నిర్మాణాల సంగతి అటకెక్కించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్యాలయాలకు కొత్త రూపు ఇస్తున్నామంటూ భారీ ప్రకటనలు చేశారు. అయితే గోల్కొండ కార్యాలయానికి కేవలం కార్యాలయ బోర్డు మాత్రమే పెట్టి చేతులు దులుపుకుంది. గోల్కొండ కోట ప్రధాన ద్వారానికి ఎదురుగా ఉన్న ఈ భవనం బల్దియాకు చెందిన వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది ఉంటున్నారు. వార్డు కార్యాలయం మొదటి గేటు ఎప్పుడు తెరుచుకోనే ఉంటుంది. రెండవ గేటు పూర్తిగా అధ్వానంగా తయారైంది. దీన్ని ముందు గుర్తు తెలియని వ్యక్తులు వ్యర్థాలను డంపింగ్ చేశారు. ఇప్పటి వరకు ఈ వ్యర్థాలను పారిశుధ్య విభాగం వారు ఎత్తకుండ వదిలేశారు. కార్యాలయ భవనానికి ఉన్న తలుపు కింది భాగం పూర్తిగా కుళ్లిపోయింది. దానికి ఆనుకొని ఉన్న కిటికికి ఉన్న జాలీ పూర్తిగా చిరిగిపోయింది. కిటికి కింది భాగం వద్ద పాన్, గుట్కాలు తిన్న వారు ఉమ్ము వేసిన కారణంగా ఆ ప్రాంతం ఎర్రగా మారి దుర్గంధం వెదజల్లుతుంది. బల్దియా డీసీఎం, ఏసీఎం అధికారులు ఇక్కడికి వస్తున్నా కూడా భవన మరమ్మత్తుల విషయమై ఎవరు పట్టించుకోవడం లేదు.


గోల్కొండ వార్డు కార్యాలయం రెండో గేటు ఎదుట వ్యర్థాలు

ఓటు హక్కు వినియోగించుకోవాలి


ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

శంషాబాద్: ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలిన శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ బి. సుమన్‌రావు, బండ్లగూడ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర సూచించారు. 'ఐ ఓట్ ఫర్ షూర్ ' పేరిట పట్టణంలోని నక్షత్రా కాలనీలో ఓటు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలింగ్ రోజును సెలవు దినంగా కాకుండా ఓటు దినంగా పరిగణించాలని సూచించారు. ఈ సందర్భంగా ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య తదితరుతు పాల్గొన్నారు.

'మనూ'లో అండర్‌గ్రాడ్యుయేషన్ కోర్సులకు అడ్మిషన్లు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో అండర్‌గ్రాడ్యుయేషన్ కోర్సులలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ గురువారం తెలిపారు. యూనివర్సిటీలోని బీఏ, బీఈడీ, బీఎస్సీ, బీకామ్ నాలుగు ఏళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు (ఐటీఈపీ) అభ్యర్థుల కోసం జాతీయ సాధారణ ప్రవేశ పరీక్ష (ఎన్‌సీఈటీ) ద్వారా కొత్త విద్యావిధానం–2020కి అనుగుణంగా అడ్మిషన్లకు ఏర్పాట్లు చేశామన్నారు.అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఏలో 50 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. బీఈడీ, బీఎస్సీ, బీకామ్ ఇంటిగ్రేటెడ్ కోర్సులలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే ఎన్‌సీఈటీలో సాధించిన స్కోర్‌ల ఆధారంగా అడ్మిషన్లు కల్పించడం జరుగుతుందని వివరించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 6207728673, 6302738370లలో సంప్రదించాలని కోరారు.

ఆరు గ్యారంటీల అమలు బాధ్యత నాది

- చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి
- రెండో సెట్ నామినేషన్ దాఖలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి

రాజేంద్రనగర్: అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు, మూడు అమలవుతున్నాయని, మిగతావి కూడా అమలు చేయించే బాధ్యత తనదని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ దేశం, తెలంగాణకు ప్రత్యేకంగా చేవెళ్లకు చేసిందేమి లేదన్నారు. కేంద్రం తెచ్చిన జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుతో సామన్యుల జీవితాలు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందని మండిపడ్డారు. పైగా ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల కల్పన, విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కి రప్పించి ఒక్కొక్కరి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామన్న ప్రధాని మోదీ తన హామీలు నిలబెట్టుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవి చాలక సీఏఏ, ఎన్ఆర్సీ లాంటి చట్టాలతో మైనార్టీలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి ఓటేస్తే.. నిండా మునుగుడేనని హెచ్చరించారు. చేవెళ్ల అభివృద్ధి కావాలన్నా.. మత సామరస్యంతో ఆనందంగా ఉండాలన్నా తనను చేవెళ్ల ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీష్ గౌడ్, సీనియర్ నాయకులు ఫహీమ్ తదితరులు పాల్గొన్నారు.

మరింత విస్తరణకు ప్రణాళికలు


సంస్థ వివరాలు వెల్లడిస్తున్న వ్యవస్థాపకుడు

మణికొండ: రాబోయే త్రైమాసికంలో 30 నుంచి 40 శాతం మంది ఉద్యోగులను నియమించుకుని మరింత విస్తరణకు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నామని యాక్సెస్ మెడిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో సయ్యద్ ఐజాజుద్దీన్ అన్నారు. గండిపేటలోని గోల్కొండ రిసార్ట్‌లో సంస్థ 17వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్సూర్‌టెక్ రంగంలో అగ్రగామిగా ఉన్న తమ సంస్థ బీమా సంస్థలు, థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్లు, అగ్రిగేటర్లు, ఇన్సూరెన్స్ బ్రోకర్ల కొరకు అత్యాధునిక సాఫ్ట్‌వేర్ సొల్యూషన్లు, సేవలు అందిస్తున్నామన్నారు. హైదరాబాద్ కేంద్రంగా చిన్న స్టార్టప్‌గా మొదలైన సంస్థ ప్రస్థానం ఆధునిక సాంకేతికత, ఈఆర్పీ పరిష్కారాలతో ప్రపంచ బీమా పరిశ్రమను శక్తివంతం చేసేందుకు తనవంతూ కృషి చేస్తుందన్నారు. మరింత విస్తరణ, పెట్టుబడులు, కొత్త ఉత్పత్తులు, సేవల పరిచయం, పరిశోధన, అభివృద్ధి, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మాడ్యూళ్లను ప్రవేశపెడుతామన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ నగీనా నర్గీస్, చీఫ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అధికారి మీర్జా ముంతాజ్ అలీ బేగ్, ప్రాజెక్ట్ డెలివరీ హెడ్ సాయి మేఘన, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

రాయదుర్గం: ఇంటింటి ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాలని, ప్రతి ఓటరును కలవాలని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా సూచించారు. గురువారం గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని ఖాజాగూడలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బూత్ కమిటీ సభ్యులు రోజూ ఉదయం ఓటర్లను కలిసి బీఆర్ఎస్‌కు ఓటు వేసేలా చూడాలన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సామూహికంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి కాలనీ, బస్తీలో ప్రచారం చేయాలని నిర్ణయించారు. నాయకులు, కార్యకర్తలు మెజార్టీ సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, మాజీ వార్డు, ఏరియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దక్షిణ మండలం డీసీపీగా స్నేహ మెహ్రా



చార్మినార్: హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని దక్షిణ మండలం డీసీపీగా ఐపీఎస్ 2018 బ్యాచ్‌కు చెందిన స్నేహ మెహ్రాను ఎన్నికల కమిషన్ నియమించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఇక్కడ డీసీపీగా పని చేసిన పోతురాజు సాయి చైతన్యను ఎన్నికల కమిషన్ బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో వెంటనే బాధ్యతలు చేపట్టే విధంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో శుక్రవారం ఉదయం ఆమె పురానీహవేలీలోని పాత పోలీసు కమిషనర్ కార్యాలయంలోని డీసీపీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టనున్నారు.

అక్రమార్కుల బరితెగింపు..!

- కాముని చెరువు సమీపంలో వెంచర్ ఏర్పాటుకు శ్రీకారం
- ఇప్పటికే ఫీడర్ ఛానల్ ధ్వంసం
- జీవో 111 పరిధిలో అనుమతి లేకున్నా పనులు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు


ఫీడర్ ఛానల్ పరిధిలో అక్రమ వెంచర్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతం

శంషాబాద్: జీవో 111 పరిధిలో ఎలాంటి వెంచర్ ఏర్పాటుకు అవకాశమే లేకున్నా అక్రమార్కులు బరితెగిస్తున్నారు. ఏకంగా నీటి వనరులను సైతం ధ్వంసం చేస్తూ వెంచర్ ఏర్పాటుకు సన్నద్ధం అవుతున్నారు. పట్టణంలోని కాముని చెరువు సమీపంలో ప్రైవేట్, ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. ఈ చెరువు ఎఫ్‌టీఎల్ మొదలు కొని ఎయిర్‌పోర్టు రోడ్డు సమీపం వరకు ఫీడర్ ఛానల్ ఉంటుంది. దీని చివరి భాగంలో ఉన్న ప్రైవేట్ వ్యక్తులు (రియల్టర్లు) ఫీడర్ ఛానల్‌కు సంబంధించిన నిర్మాణాన్ని సైతం తొలగించి చదును చేశారు. అక్కడే వెంచర్ ఏర్పాటుకు పనులు చేపడుతున్నారు.

చారిత్రాత్మక చెరువు: పట్టణానికి ముఖద్వారంగా ఉండే కాముని చెరువు మొత్తం 53 ఎకరాల్లో విస్తరించి ఉంది. నిజాం కాలంలో నిర్మించిన ఈ చెరువు ఎఫ్‌టీఎల్ నుంచి పెద్ద ఎత్తున ఫీడర్ ఛానల్‌ను అనుసంధానంగా నిర్మాణం చేశారు. ఫీడర్ ఛానల్‌కు అక్కడక్కడ పెద్ద పెద్ద ఆర్చీలను సైతం ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి నీరు జోష్‌కుంట వైపునకు వెళుతుంది. ప్రధాని రహదారి పక్కనే రెండు ఆర్చీలను ఇప్పటికే కొందరు రియల్టర్లు ధ్వంసం చేశారు. నీటి వనరులను అందించే ఛానల్ వద్ద జరుగుతున్న అక్రమ వెంచర్ల ఏర్పాటుపై నీటిపారుదల శాఖ అధికారులు చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఫీడర్ ఛానల్‌ను ధ్వంసం చేసే రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ఫీడర్ ఛానల్‌ను ధ్వంసం చేసి ఆ ప్రాంతాన్ని చదును చేసినట్లు ఫిర్యాదు వచ్చింది.దీంతో అక్కడికి వెళ్లి పరిశీలించి పనులను వెంటనే నిలిపివేయించాం. అక్కడ వెంచర్ గానీ. ఎలాంటి నిర్మాణాలు గానీ చేపట్టేందుకు అనుమతులు లేవు. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం.

–బి. సుమన్‌రావు, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్

పట్టించుకోవడం లేదు..



శంషాబాద్‌లో నీటి వనరులు ధ్వంసం చేస్తున్నా ఇరిగేషన్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కాముని చెరువు ఫీడర్ ఛానల్‌ను కొందరు ధ్వంసం చేసి వెంచర్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. సంబంధిత వ్యక్తులపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోని చారిత్రాత్మక ఫీడర్ ఛానల్‌ను పరిరక్షించాలి.

–తోకల మురళి, శంషాబాద్

బ్రీడర్ విత్తనాల ఉత్పత్తి మినీ కిట్ల సరఫరాపై సమావేశం


సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బ్రీడర్ విత్తనాల ఉత్పత్తి మినీ కిట్ల సరఫరాపై గురువారం సమావేశం నిర్వహించారు. రిజిస్టర్ ఎం వెంకటరమణ పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి రఘురామిరెడ్డి పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ పంటల్లో అధిక ఉత్పత్తి , ఉత్పాదకత లాభాదాయకత సాధించేందుకు అవసరమైన అనేక వంగడాలను జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సాధించిందని వాటిని రైతుల్లోకి విస్తృతంగా తీసుకవెళ్లడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీడ్ రీసెర్చ్ ట్రైనింగ్ సెంటర్ సంచాలకుడు జగన్‌మోహన్‌రావు, వ్యవసాయ శాఖ అదనపు సంచాలకుడు విజయ్‌కుమార్, నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ రీజినల్ మేనేజర్ సంధ్యారాణి, శంకరయ్య, సీడ్ మెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230